నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I హైదరాబాద్, సోమవారం 30 సెప్టెంబర్ 2024 SANGAREDDY

# కవులు, రచయితలు మేలుకోవాలి


సిద్దిపేటలో మరసం జెండాను ఆవిష్కరిస్తున్న అధ్యక్షుడు రంగాచారి, పాల్గొన్న కవులు

- అవాంఛనీయ ఘటనలపై బలంగా స్పందించాలి
- ప్రముఖ సాహితీవేత్త, ఆంధ్రజ్యోతి పత్రిక సంపాదకుడు కె.శ్రీనివాస్
- సిద్దిపేటలో ఘనంగా మరసం 38వ వార్షికోత్సవం
- హాజరైన పలువురు కవులు, ప్రజాప్రతినిధులు
- పలు పుస్తకాలను ఆవిష్కరించిన సాహితీవేత్తలు

సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 29 : దేశంలో కలవరపెడుతున్న ఘటనలపై కవులు, రచయితలు మేలుకోవాలని ప్రముఖ సాహితీవేత్త, ఆంధ్ర జ్యోతి పత్రిక సంపాదకుడు కె.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సిద్దిపేటలోని విపంచి కళానిలయంలో మంజీరా రచయితల సంఘం 38వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా ముందుగా మరసం జెండాను అధ్యక్షుడు రంగాచారి ఆవిష్కరించారు. ఇటీవల అమరులైన కవులు, రచయితలకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. అనంతరం పలువురు కవులు రాసిన పుస్తకాలను ఆవిష్కరించారు. ప్రారంభ ఉపన్యాసం చేసిన కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశంలో రాజ్యాంగ నైతిక విలువలు పాటించడం లేదన్నారు. విద్వేషాలు పెరుగుతున్న పరిస్థితుల్లో ఆధునిక భారతాన్ని నిర్మించడం అనివార్యమన్నారు. ప్రస్తుతం ఉన్న తెలంగాణ ప్రభుత్వంలో తెలంగాణ అస్తిత్వ వాసనలే లేవన్నారు. తెలంగాణ ఆత్మగౌరం కోసం జరిగిన ప్రాణ త్యాగాలకు విలువ ఉండాలన్నారు. ఇప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాల్లో అంతరాలు ఉన్నాయని, సమస్యల మూలాలను శోధించి పరిష్కారాలను వెతకాలన్నారు. రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో తెలంగాణ తనం ఉండాలని కోరారు. అవాంఛనీయ పరిస్థితులు కమ్ముకుంటున్న నేపథ్యంలో కవులు, రచయితలు మేలుకోవాలని సూచించారు. సాహిత్యంలో వ్యక్తీకరణ, సృజనాత్మకత బాగున్నప్పటికీ వస్తు దారిద్యం ఉందన్నారు. భయం లేని పాలకులు అన్నిరకాల చైతన్యాన్ని హరిస్తారని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమానికి పాలకులు భయపడాల్సిన పరిస్థితులు తీసుకురావాలని సూచించారు. తెలంగాణ ఆత్మ మంజీరా, మూసీ లాంటి ఉపనదుల్లో ఉందన్నారు. మరసం ఉపనదిగా ప్రారంభమై, మహానదిగా పురోగమిస్తోందని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర అవతరణ కాంక్షను జ్వలింపజేసిన మంజీరా రచయితల సంఘం, ఇప్పుడు మరింత బాధ్యతగా తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా పురోగమించాలన్నారు.ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ రచించిన జయ జయహే తెలంగాణ పాటల పుస్తకం, మరసం కవులు రచించిన జోట పాటలు కవితా సంకలనం, సిద్దంకి యాదగిరి రచించిన మూడు గుడిసెల పల్లె పుస్తకాన్ని అతిథులు కె.శ్రీనివాస్, నందిని సిధారెడ్డి, దేశపత్రి శ్రీనివాస్, విరాహత్ అలీ ఆవిష్కరించారు.సిద్దిపేట టీఎన్‌జీవో సంఘం అధ్యక్షుడు పరమేశ్వర్,టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, తోట అశోక్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటలో పలు పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కవులు, ముఖ్య అతిథులు

## ఎందరికో పోరాట స్ఫూర్తిని నింపింది



మరసం తనకు కన్నతల్లి లాంటిదని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మరసం ఎంతో మందికి పోరాట స్ఫూర్తిని కలిగించిందన్నారు. ఒక నిశ్శబ్ధ కాలాన్ని ఛేదించేందుకు ధైర్యం చేసింది మరసం అన్నారు. ఒక కళాకారునిగా తెలంగాణ ఆట పాటకు ధూం ధాం అనే ఆలోచన కలిగించింది మంజీరా రచయితల సంఘం అన్నారు. తీరొక్క పూలను తీసుకొచ్చి బతుకమ్మను పేర్చిన మాదిరిగా, ఎందరో కవులను ఒకే వేదికపైకి తీసుకురావడానికి మరసం శ్రీకారం చుట్టిందన్నారు.

– మాజీ ఎమ్మెల్యే రసమయి బాలికిషన్

## ఉద్యమంలో గొప్ప పాత్ర



నాడు తెలంగాణ ప్రజల వీరోచిత లక్ష్యం కోసం, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని మంజీరా రచయితల సంఘం ముందే పసిగట్టి ప్రారంభించిందని బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ అన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో మంజీరా రచయితల సంఘం గొప్ప పాత్ర పోషించిందన్నారు. మూసీ అభివృద్ధి పేరిట ప్రజలను నిరాశ్రయులను చేసే కుట్ర జరుగుతున్నదని, వీటన్నింటినీ మనసులో పెట్టుకొని మరసం తన పదును పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

– కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్



జహీరాబాద్ పట్టణంలోని
విజయ డెయిరీ పాలశీతలీకరణ కేంద్రం



# పాడిరైతు పాట్లు

- విజయ డెయిరీ బకాయిలు రూ.1.75 కోట్లపైనే...
- డబ్బులు అందక 4,892 మంది రైతుల ఇబ్బందులు
- ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్
- రూ.6కోట్ల ఇన్సెంటివ్ డబ్బుల చెల్లింపులపై కానరాని స్పష్టత

సంగారెడ్డి, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ)/సంగారెడ్డి/జహీరాబాద్: విజయడెయిరీని నమ్ముకుని పాలు పోసిన రైతులకు డబ్బులు అందక ఇక్కట్లు పడుతున్నారు. సంగారెడ్డి జిల్లాలోని 4892 మంది రైతులకు విజయడెయిరీ రూ.1.75 కోట్లపైగా బకాయిలు చెల్లించాల్సి ఉంది. మూడు నెలలుగా రైతులు తమకు రావాల్సిన బకాయి డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు. అయినా ప్రభుత్వం, విజయడెయిరీ రైతులకు బకాయిలు చెల్లించడంలేదు. సంగారెడ్డి జిల్లాలోని 22 మండలాల్లో పాల ఉత్పత్తి ఎక్కువగా ఉంటుంది. నారాయణఖేడ్, సంగారెడ్డి, అందోల్, జహీరాబాద్ నియోజకవర్గాల్లో పాడి రైతులు ఎక్కువగా ఉన్నారు. నాలుగు నియోజకవర్గాల్లోని 22 మండలాల పరిధిలోని 152 గ్రామాల నుంచి పాడి రైతుల నుంచి విజయడెయిరీ పాలను సేకరిస్తుంది. 152 గ్రామాల నుంచి 101 పాల సేకరణ కేంద్రాల ద్వారా పాడి రైతుల నుంచి మొదట పాలను సేకరిస్తారు. ఇలా సేకరించిన పాలను 23 రూట్ల ద్వారా మాచిరెడ్డిపల్లి, ,కోహీర్, సదాశివపేట, తడ్కల్, జోగిపేట, నారాయణఖేడ్‌లోని బల్క్ మిల్క్ సెంటర్లకు చేరుస్తారు. ఆ తర్వాత అక్కడి నుంచి పాలను నారాయణఖేడ్, జహీరాబాద్‌లోని మిల్క్ చిల్లింగ్ కేంద్రాలకు తరలిస్తారు. సంగారెడ్డి జిల్లాలో రోజూ 4892 మంది పాడి రైతుల నుంచి 10,500 లీటర్లను సేకరిస్తున్నారు. ఇలా సేకరించిన పాలను ప్రాసెసింగ్ చేసి పాలు, పాల ఉత్పత్తులను విజయడెయిరీ నేరుగా వినియోగదారులకు విక్రయిస్తుంది. జిల్లాలో పాలసేకరణ, విక్రయాలు సజావుగానే సాగుతున్నప్పటికీ రైతులకు చెల్లించాల్సిన డబ్బులను మాత్రం విజయడెయిరీ చెల్లించడం లేదు. పాడి రైతులకు కోట్లల్లో బకాయిలు చెల్లించాల్సి ఉండటంతో రైతులు విజయడెయిరీకి పాలు విక్రయించేదిలేదంటూ మొండికేసే పరిస్థితి నెలకొంది. దీనిని ఆసరాగా తీసుకుని ప్రైవేట్ డెయిరీ కంపెనీలు విజయడెయిరీకి సంబంధించిన పాడి రైతులను తమవైపు తిప్పికుని పాల సేకరణను పెంచుకునే ప్రయత్నాలు మొదలుపెట్టాయి.


సంగారెడ్డి జిల్లా మామిడ్గి గ్రామంలోని
పాలసేకరణ కేంద్రంలో పాలుపోస్తున్న రైతులు

### మూడు మాసాలు...
### రూ.1.75 కోట్లకు పేరుకుపోయిన బకాయిలు

సంగారెడ్డి జిల్లాలో విజయడెయిరీ రైతులకు రూ.1.75 కోట్లకుపైగానే డబ్బులు బకాయిపడింది. బకాయి డబ్బులు రాక పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజూ పాడి రైతులు తమ పశువులకు తప్పకుండా గడ్డి, దాణా తినిపించడంతోపాటు పాడిదిగుబడి తగ్గినప్పుడు, వ్యాధులు సోకినప్పుడు సరైన చికిత్సలు చేయించేందుకు డబ్బులు అవసరం అవుతాయి. పాలు కొనుగోలు చేసిన విజయడెయిరీ మూడు మాసాలుగా డబ్బులు చెల్లించడం లేదు. దీంతో రైతులు డబ్బుల కోసం ఇక్కట్లు పడాల్సి వస్తోంది. విజయడెయిరీ పాలలోని ఫ్యాట్ పర్సంటేజీని అనుసరించి డబ్బులు చెల్లిస్తుంది. లీటర్ పాలలో ఐదు శాతం ఫ్యాట్ పర్సంటేజీ ఉంటే రూ.40, లీటర్ పాలలో 6 నుంచి 10 శాతం ఫ్యాట్ ఉంటే రూ.80 చెల్లిస్తుంది. జిల్లాలోని 4892 మంది రైతుల నుంచి సేకరించిన పాలకు ప్రతి15రోజులకు ఒకసారి విజయడెయిరీ డబ్బులు చెల్లిస్తుంది. జూలై, ఆగస్టు,సెప్టెంబర్ మాసాలకు సంబంధించి పాడి రైతులకు విజయడెయిరీ డబ్బులు చెల్లించాల్సి ఉంది. జూలై నెలకు సంబంధించి రూ.61 లక్షలు, ఆగస్టు నెలకు సంబంధించి రూ.64 లక్షలు, సెప్టెంబర్ నెలకు సంబంధించి ఇప్పటి వరకు రూ.50 లక్షల బకాయిలు చెల్లించాల్సి ఉంది. మూడు మాసాలుగా జిల్లాలోని 4892 మంది రైతులకు రూ.1.75 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉన్నా ఇప్పటి వరకు చెల్లించలేదు. దీంతో పాడి రైతులు విజయడెయిరీ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించాలని లేదంటే ఆందోళనకు దిగుతామని పాడి రైతులు హెచ్చరిస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలోని పాడి రైతులకు రూ.6 కోట్లకుపైగా ఇన్సెంటివ్ బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇన్సెంటివ్ బకాయిలను సైతం ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పాడి రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## బకాయిలు ఉన్నది వాస్తవమే

జిల్లాలో పాడి రైతులకు చెల్లించాల్సిన బకాయిలు ఉన్నది వాస్తవమే. పది, పదిహేను రోజుల్లో ప్రభుత్వం నిధులు విడుదల చేసే అవకాశం ఉన్నది. డబ్బులు రాగానే రైతుల వారీగా చెల్లింపులు చేస్తాం. రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న మాట వాస్తవమే. నిత్యం విజయ పాల డెయిరీకి రైతులు పాలు పోస్తున్నారు. గ్రామాల నుంచి పాలశీతలీకరణ కేంద్రాలకు పాలు తరలిస్తున్నారు. అక్కడి నుంచి విజయ డెయిరీకి ప్రత్యేక వాహనాల్లో జిల్లా నుంచి రోజూ 10వేల లీటర్లకు పైగా పాలు వస్తున్నాయి. విజయ డెయిరీ ఉత్పత్తులు రైతులకు అంతగా అవసరం ఉండదు. దాణా, గడ్డి విత్తనాలు, కాల్షియం మందుల వరకే అవసరం ఉంటాయి.

- గోపాల్ సింగ్, విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ సంగారెడ్డి జిల్లా

## సిద్దిపేట జిల్లాలో...

సిద్దిపేట, సెప్టెంబర్ 29 : సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా విజయ డెయిరీకి 3,000మంది రైతులు నిత్యం పాలు పోస్తున్నారు. మొత్తం పెండింగ్ ఉన్న బిల్లులు రూ. 8 కోట్ల 20 లక్షలు ఉన్నాయి. ప్రైవేట్ డెయిరీని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండాసతాయిస్తున్నదని రైతులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా హెరిటేజ్ డెయిరీకి మేలు చేకూర్చేందుకు బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతుందని రైతులు ఆరోపిస్తున్నా రు. ఈ విషయంపై విజయ డెయిరీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, రాష్ట్ర డెయిరీ సమాఖ్య చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ధర తగ్గించాలనే ఆలోచనలో యాజమాన్యం ఉన్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

## పాల బిల్లులు చెల్లించి ఆదుకోవాలి



జహీరాబాద్, సెప్టెంబర్ 29 : గ్రామ సంఘం నుంచి రోజూ జహీరాబాద్ పాలశీతలీకరణ కేంద్రానికి 900 లీటర్ల పాలు వెళ్తాయి. ప్రభుత్వం గత జూలై 15 వరకు మాత్రమే పాల బిల్లులు చెల్లించింది. ఆ తర్వాత బిల్లులు చెల్లించకపోవడంతో పాడి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. నాకు రెండున్నర నెలలకు సంబంధించి రూ. 25 లక్షల పాల బిల్లులు రావాల్సి ఉంది. పశువులతో పాటు, కుటుంబ పోషణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అప్పోసొప్పు చేసి బిల్లులను వెంటనే చెల్లిస్తున్నా. ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని వెంటనే బిల్లులు చెల్లించి పాడి రైతులను ఆదుకోవాలి.

- బరూర్ మాణిక్‌రెడ్డి, పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు, మామిడ్గి గ్రామం, న్యాల్‌కల్ మండలం

## ప్రైవేట్ వ్యాపారికి పాలు పోస్తున్నా..



జహీరాబాద్, సెప్టెంబర్ 29: సకాలంలో విజయ డెయిరీకి పాలు పోసినా బిల్లులు రాక ఇబ్బందులు తప్పడం లేదు. రెండు నెలలకు సంబంధించిన పాల బిల్లులు రాలేదు. దీంతో ప్రైవేట్ వ్యాపారికి పాలుపోస్తున్నా. సకాలంలో బిల్లులు రాకపోవడం వల్ల పశువులు, కుటుంబ పోషణ భారంగా మారింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రైవేట్ వ్యాపారిని ఆశ్రయించాల్సిన వచ్చింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి త్వరగా పెండింగ్ పాల బిల్లులు ఇప్పించాలి.

- గార్లపల్లి అశోక్, పాడి రైతు, హద్నూర్ గ్రామం, న్యాల్‌కల్ మండలం, సంగారెడ్డి జిల్లా

## మూడు నెలలుగా బిల్లులు రావడం లేదు



మూడు నెలలుగా పాల బిల్లులు రావడం లేదు. నేను చాలా ఏండ్లుగా విజయ డెయిరీకే పాలు పోస్తున్నాను. ప్రతినెలా సుమారు రూ.30వేల వరకు పాల బిల్లులు వస్తాయి. మూడు నెలలుగా రూ.90వేల బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. బీఆర్‌ఎస్ సర్కారు ఉన్నప్పుడు మాకు నెలనెలా బిల్లులు వచ్చాయి. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు ఎందుకు ఇట్ల చేస్తున్నదో అర్థమైతలేదు. గతంలో బోనస్ ఇచ్చేవారు. ఇప్పుడు బోనస్ లేదు... పాల బిల్లులు కూడా అందడం లేదు. దీంతో రైతులు డబ్బులకు ఇబ్బందులు పడుతున్నారు.

– సాయిరెడ్డి, పాడిరైతు, రామతీర్థం, మెదక్ జిల్లా

## పాల కేంద్రాలను నడపడం కష్టంగా మారింది



విజయ పాల కేంద్రాల్లో పాలుపోసే రైతులకు రెండు నెలలుగా పాల బిల్లులు రావడం లేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పదిహేను రోజులకొక్కసారి రైతుల అకౌంట్‌లో పాల బిల్లులు పడేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పాల బిల్లుల కోసం రైతులు పాలకేంద్రం చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం మాత్రం బిల్లులు వేయడం లేదు. పశువులకు దాణా, మేతపెట్టని దుస్థితి నెలకొంది. గతంలో లీటర్‌కు రూ.నాలుగు బోనస్ ఇచ్చేవారు. ఇప్పుడు బోనస్ మాట అటుంచితే పాల బిల్లులు కూడా అందడం లేదు. దీంతో గ్రామాల్లో పాల కేంద్రాలను నడపడం కష్టమవుతున్నది.

– చెవిటి మహేశ్, విజయ డెయిరీ చైర్మన్, గాగిళ్లాపూర్, మద్దూరు మండలం, సిద్దిపేట జిల్లా

# ప్రాజెక్టు నిర్మాణమయ్యేనా!

- వృథాగా కర్ణాటకకు తరలిపోతున్న జాడిమల్కాపూర్ జలాలు
- పెద్దవాగుపై ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మిస్తే రైతులకు ప్రయోజనం
- ప్రాజెక్టు నిర్మాణంతో మొగుడంపల్లి మండలంలో 2వేల ఎకరాలకు సాగునీరిచ్చే అవకాశం
- చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తే భూగర్భ జలాల వృద్ధికి దోహదం
- పర్యాటక ప్రాంతంగా అభివృద్ధికి అవకాశం
- ప్రభుత్వం పట్టించుకోవాలని కోరుతున్న రైతులు, పర్యాటకులు


కర్ణాటకలో నిండుకుండలా చంద్రంపల్లి ప్రాజెక్టు పరిసరాలు

జహీరాబాద్, సెప్టెంబర్ 29 : కొండ కోనలు, గుట్టల మధ్య నుంచి గలగలా పారుతూ పరవళ్లు తొక్కుతూ జలాలు కర్ణాటక వైపు వృథాగా తరలిపోతుండడంతో సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి రైతులు నిరాశకు లోనవుతున్నారు. మొగుడంపల్లి మండలం జాడిమల్కాపూర్ గ్రామ శివారులోని తెలంగాణ-కర్ణాటక సరిహద్దు ప్రాంతం గుండా ప్రవహించే పెద్దవాగు నుంచి జలాలు వృథాగా కర్ణాటకకు కండ్ల ముందు తరలిపోతున్నా ఏం చేయలేని పరిస్థితి మొగుడంపల్లి మండల రైతులది. ఈ ఎత్తిపోతల జలపాతం గుండా పారుతున్న నీటిని మొగుడంపల్లి మండల సాగునీటి అవసరాలకు వినియోగించుకోవచ్చు. ఈ పెద్దవాగుపై ఎత్తిపోతల ప్రాజెక్టును నిర్మిస్తే న్యాల్‌కల్ మండలంలో 2వేల ఎకరాలకు పైగా సాగునీరు ఇవ్వడంతో పాటు భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుంది. కానీ, ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ దిశగా కృషిచేయడం లేదు. పెద్దవాగు గుండా ప్రవహిస్తున్న జలాలు కర్ణాటకలోని చంద్రంపల్లి ప్రాజెక్టుకు చేరుతున్నాయి. వేసవిలోనూ ఈ వాగు ప్రవహిస్తూ చంద్రంపల్లి ప్రాజెక్టును జీవనదిగా మార్చింది. ఎత్తిపోతలే నిర్మించాల్సిన జాడిమల్కాపూర్ జలపాతం సందర్శనకు సెలవు రోజుల్లో భారీగా పర్యాటకులు తరలివస్తున్నారు. ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం పర్యాటకంగా అభివృద్ధి చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

### ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంటే ఉపయోగం...

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహీర్ మండలంలోని గొటిగార్‌పల్లి గ్రామ శివారులో పెద్దవాగు ప్రాజెక్టు వర్షాకాలంలో కురిసే భారీ వర్షాలకు నిండుతుంది. దీంతో ఈ ప్రాజెక్టు నుంచి దిగువకు వెళ్తున్న వరద జహీరాబాద్, మొగుడంపల్లి మండలంలోని మల్‌చల్మ, జాడిమల్కాపూర్, సజ్జారావుపేట తదితర గ్రామాల మీదుగా కర్ణాటకకు తరలిపోతున్నది. కర్ణాటకలోని గుల్‌బర్గా జిల్లాలోని చించోళి తాలూకా పరిధిలోని బీమా నది తీరంలో 1973లో చంద్రంపల్లి ప్రాజెక్టును నిర్మించారు. ఈ ప్రాజెక్టుకు పెద్దవాగు గుండా ప్రవహిస్తూ వృథాగా వెళ్లే జాడిమల్కాపూర్ జలపాతం జలాలే ప్రధాన ఆధారం. ఈ ప్రాజెక్టు ద్వారా కర్ణాటక ప్రాంతానికి సాగు, తాగునీటి అవసరాలు తీరుతున్నాయి. కానీ, వృథాగా పోతున్న ఈ నీటిని సద్వినియోగం చేసుకునే దిశలో సంగారెడ్డి జిల్లా యంత్రాంగం కృషిచేయడం లేదు. పెద్దవాగు ప్రాజెక్టు నిర్మాణానికి అనుకూలంగా ఉన్నా, పాలకులు శ్రద్ధ చూపడం లేదు. పెద్దవాగు ఇరువైపులా కొండలు ఉండడంతో ప్రాజెక్టు నిర్మించి, ఎత్తిపోతల ద్వారా పొలాలకు సాగునీటిని అందివచ్చని రైతులు చెబుతున్నారు. ఎత్తిపోతల పథకం నిర్మిస్తే మొగుడంపల్లి మండలంలోని జాడిమల్కాపూర్, సజ్జారావుపేట తదితర గ్రామాలకు చెందిన దాదాపు 2వేల ఎకరాలకు నీరందించవచ్చు. దశాబ్దం క్రితం పెద్దవాగుపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి అప్పట్లో సంబంధింత అధికారులు ప్రభుత్వానికి నివేదికలను పంపించారు. కానీ, నిధులు మంజూరు కాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రాజెక్టు నిర్మించాలని రైతులు కోరుతున్నారు.


సంగారెడ్డి జిల్లా జాడిమల్కాపూర్ శివారులో
పరవళ్లు తొక్కతున్న జలపాతం

### పెద్దవాగుపై ప్రాజెక్టును నిర్మించాలి



పెద్దవాగు గుండా ప్రవహిస్తూ కర్ణాటకకు తరలిపోతున్న జలాలను సద్వినియోగం చేసుకునేలా మన ప్రభుత్వం దృష్టిసారించాలి. కర్ణాటకకు వృథాగా పోతున్న జలాలను వినియోగించుకోవడానికి వీలుగా పెద్దవాగుపై ఎత్తిపోతల ప్రాజెక్టును నిర్మించాలి. ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మిస్తే సుమారు 2వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. అంతేకాకుండా పర్యాటకంగా అభివృద్ధి చేయవచ్చు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణానికి కృషిచేయాలి.

–గిర్మాగారి పరశురామ్, ఆత్మకమిటీ మాజీ డైరెక్టర్, జాడిమల్కాపూర్

### పర్యాటకంగా అభివృద్ధి చేయాలి..

జాడిమల్కాపూర్ ఎత్తిపోతల జలపాతం ప్రాంతాన్ని ప్రభుత్వం పర్యాటకంగా అభివృద్ధి చేయాలి. వర్షాకాలంతో పాటు వారంతపు సెలవులు దొరికినప్పుడు ఎత్తిపోతల జలపాతాన్ని చూసేందుకు తెలంగాణ, కర్ణాటక నుంచి పర్యాటకులు వస్తున్నారు. అటవీ ప్రాంతంలో కొండ కోనలు, గుట్టల మధ్య నుంచి జలపాత సోయగాలు పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఇక్కడ కనీస సౌకర్యాలు లేక సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు సరిగ్గా లేక రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం హోటళ్లు, వసతి గృహాలు నిర్మించి, రోడ్డును బాగు చేసి పర్యాటక అభివృద్ధికి కృషిచేయాలి.

### సింగూరు ప్రాజెక్టు గేట్లు మూసివేత

పుల్కల్,సెప్టెంబర్ 29 : సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టుకు వదర తగ్గడంతో ఆదివారం ఉదయం 10.30 గంటలకు అన్ని గేట్లను అధికారులు మూసి వేశారు. 6,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. 2784 క్యూసెక్కుల నీరు దిగువకు వదిలినట్లు ప్రాజెక్టు ఏఈ మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పూర్తిసామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, 29.678 టీఎంసీల నీరు నిల్వ ఉంది.గొర్రెల కాపరులు,మత్స్యకారులు నది పరీవాహక ప్రాంతాలకు వెళ్లకూడదని నీటి పారుదల శాఖ అధికారులు హెచ్చరించారు.

# గురువన్నపేటలో దారుణం

- బాలికపై ట్రాక్టర్ డ్రైవర్ లైంగికదాడి
- నిందితుడి ఇంటిపై గ్రామస్తుల దాడి
- ఇంటికి నిప్పు, వాహనాలు ధ్వంసం
- భారీగా మోహరించిన పోలీసులు
- నిందితుడిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తుల డిమాండ్
- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కొమురవెల్లి, సెప్టెంబర్ 29 : సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం గురువన్నపేటలో అమ్మాయి(10)పై అదే గ్రామానికి చెందిన ఎండీ షార్ఫొద్దీన్ అనే వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. గ్రామస్తులు, కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. గురువన్నపేట ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న బాలిక శుక్రవారం సాయంత్రం ఇంట్లో తన ఇద్దరు చెల్లెల్లతో ఆడుకుంటున్న సమయంలో పక్క ఇంట్లో ఉండే ట్రాక్టర్ డ్రైవర్ ఎండీ షార్ఫొద్దీన్(20) ఇంట్లోకి ప్రవేశించి తలుపులు మూసివేసి బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు.జరిగిన విషయం చెప్పవద్దని బాలికను బెదిరించాడు. దీంతో బయపడిన బాలిక ఆ విషయం ఇంట్లో ఎవరికీ చెప్పలేదు. శనివారం పాఠశాలకు వెళ్లొచ్చిన బాలిక ఆలసటతో ఉండటంతో రాత్రి కుటుంబసభ్యులు ఏమైందని అడగడంతో సెకిల్‌పై నుంచి పడినట్లు చెప్పింది.అదే సమయంలో జరిగిన సంఘటన గురించి బాలిక చెల్లెల్లు తల్లిదండ్రులకు తెలుపడంతో వారు 100కు ఫోన్ చేయడంతో రాత్రి చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్సై రాజుతో కలిసి నిందితుడిని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.ఆదివారం ఉదయం విషయం తెలుసుకున్న గ్రామస్తులు నిందితుడి ఇంటి వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ పహారా కాస్తున్న పోలీసులు కళ్లు గప్పి ఒక్కసారిగా నిందితుడి ఇంటికి నిప్పు అంటించి వాహనాలను ధ్వంసం చేశారు. వెంటనే పోలీసులు మంటలను అదుపులోకి తెచ్చారు. హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ ఆధ్వర్యంలో గ్రామంలో భారీగా పోలీసు పహారాను ఏర్పాటు చేశారు. గ్రామంలో 144 సెక్షన్ విధించారు. నిందితుడి ఇంటి వద్ద ఉన్న పలు వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న సిద్దిపేట జిల్లా డీసీపీ(అడ్మిన్) మల్లారెడ్డి గ్రామాన్ని సందర్శించి పోలీసులకు పలు సూచనలు చేశారు. బాలికపై లైంగిక దాడి జరిగిన విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వెంటనే సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధకు ఫోన్‌చేసి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాలిక తల్లితో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటామని,నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బీజేపీ నాయకులు భారీగా తరలి వచ్చి గ్రామంలో ఆందోళన నిర్వహించారు.


గ్రామస్తుల దాడిలో ధ్వంసమైన కారు


సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం గురువన్నపేటలో
నిందితుడి ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు